క్లుప్తంగా

బీపీ యూనిట్ల అందజేత



ఆసుపత్రి వైద్యులకు బీపీ కిట్లు అందజేస్తున్న ఎస్సై మౌనిక, యువకులు

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి యువత బీపీ యూనిట్లను సమకూర్చగా, వాటిని బుధవారం ఎస్సై మౌనిక ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షల అవసరం పెరగడంతో దీనిని దృష్టిలో ఉంచుకుని యువత మూడు బీపీ యూనిట్లు సమకూర్చారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కాకినాడకు చెందిన సోము దుర్గప్రసాద్ చారిటబుల్ ట్రస్టు నుంచి బీపీ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు యూత్ రాజ్‌కుమార్, స్వాతి తెలిపారు. యూత్ సభ్యులు దేవగురు చంద్రశేఖర్, జట్ల దుర్గాచైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం



సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతున్న చైర్‌పర్సన్, కమిషనర్, సభ్యులు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఇటీవల మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ మృతి చెందగా కౌన్సిల్ సంతాపం తెలిపింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సభ్యులకు మాట్లాడే అవకాశం లేకపోవడంతో చైర్‌పర్సన్ అరుణ ఇటీవల మృతి చెందిన ప్రసాద్‌కు సంతాపం తెలియజేశారు. మినిట్స్ రిజిస్టర్‌లో చైర్‌పర్సన్ సంతకం చేసి సమావేశం ముగిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, అధికార, ప్రతిపక్ష సభ్యులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఠాపురం ఆర్వో, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి బుధవారం కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

నేడు స్వరార్చన

బోట్‌క్లబ్: ఆర్కెస్ట్రా పితామహుడు దివంగత పెద్దిరెడ్డి గంగాధరం మాస్టర్ జయంతి సందర్భంగా గురువారం స్వరార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు పెద్దిరెడ్డి సతీష్ బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. స్థానిక సినిమా రోడ్డులోని సూర్యకళా మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశ విదేశాల్లో వేలాదిగా సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించిన ఘనత గంగాధర్ మాస్టర్‌దే అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1955లో ఆర్కెస్ట్రాను స్థాపించారన్నారు. అప్పటి తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామ సమీపంలోని హసన్‌బాద్‌లో 1937లో గంగాధరం జన్మించారన్నారు. సంగీతంపై ఉన్న మక్కువతో చించినాడ సన్యాసిరావు వద్ద కర్ణాటక సంగీతం, ఆకుల నరసింహారావు వద్ద హిందుస్థానీ సంగీతం, హార్మోని నేర్చుకున్నట్లు చెప్పారు. సంగీత విభావరికి చెన్నై నుంచి ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ రాము పాల్గొంటారన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

గొల్లప్రోలు: మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు తాడును అపహరించినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. బుధవారం రౌతులపూడి గ్రామానికి చెందిన పసగొడుగుల రాంబాబు, అతని భార్య కనకమహాలక్ష్మి మోటారు సైకిల్‌పై ప్రత్తిపాడు వైపు వెళ్తుండగా దొడ్లడైరీ సమీపంలో ఈ ఘటన జరిగింది. వారి వెనక నుంచి మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి రాజమండ్రి ఎంత దూరం అని అడిగారు. వారికి ఆ దంపతులు నెమ్మదిగా ఆగి సమాధానం ఇస్తుండగా ఆమె మెడలోని సుమారు 10 గ్రాముల బంగారు తాడును తెంచుకుని పోయినట్లు ఎస్సై బాలాజీ తెలిపారు. కనకమహాలక్ష్మి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం కాగా, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పంచారామ క్షేత్రంలో శివలింగం జీర్ణోద్ధరణ

- పనులు ప్రారంభించిన పురావస్తు శాఖ
- ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఆలయంలో అగ్నిహోత్ర హోమం నిర్వహిస్తున్న పండితులు



పురావస్తు శాఖ అధికారులతో చర్చిస్తున్న ఈఓ భళ్ల నీలకంఠం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. క్షేత్రంలో స్వామివారి శివలింగం జీర్ణస్థితికి చేరుతున్నట్లు గుర్తించి దేవదాయ శాఖాధికారుల సూచనల మేరకు కేంద్ర పురావస్తు శాఖ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా శివలింగానికి జీర్ణోద్ధరణ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ శివలింగం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా స్వామివారి, అమ్మవార్ల దర్శనాలు నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్‌లు మండపారాధనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. కలశస్థాపన, కళారాధన, దేవతారాధన, అగ్నిహోత్ర సంబంధమైన హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణకంభంలో కళలను ఆవాహన చేశారు. ఈ మేరకు ఉత్సవ, దేవతామూర్తులను ఆవాహన చేసిన పూర్ణకుంభాన్ని నంది మండపంలో ఏర్పాటు చేసి ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు చేశారు. నంది మండపంపై ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులను ఉదయం 10.40 గంటలకు భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించారు.

దర్శనాలు నిలిపివేసి..

అతిపురాతన పంచారామ క్షేత్రంలోని స్వామివారిని భావితరాల వారు దర్శించుకునే విధంగా 15 ఏళ్ల కిందట కెమికల్ ట్రీట్‌మెంట్ చేశారు. కాగా బుధవారం నుంచి మళ్లీ శివలింగానికి కెమికల్ ట్రీట్‌మెంట్ చేయడానికి శివలింగాన్ని పురావస్తు శాఖాధికారులకు ఈఓ భళ్ల నీలకంఠం స్వాధీనం చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సమయంలో స్వామి వారిని దర్శించుకోవడం మంచిది కాదని, గర్భాలయాలను మూసి వేసి భక్తుల దర్శనాలు నిలిపివేశారు. భక్తులు ధ్వజస్తంభం మీదుగా ఆలయంలోకి ప్రవేశించి పెద్ద నంది వద్ద ఉన్న మండపంపై ఉత్సవ మూర్తులను దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జీర్ణోద్ధరణ పనులకు సంబంధించి ఏర్పాట్లను పురావస్తు శాఖ సీఏ కేవీఎన్ మూర్తి, ఉపస్తపతి జి.శ్రీనివాసాచార్యులు, ఈఓ భళ్ల నీలకంఠం పరిశీలించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదానం కొనసాగింది. భక్తులకు దేవస్థాన సిబ్బంది, భక్త సంఘ నాయకుడు తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ సేవలందించారు.

జానపద సాంస్కృతిక ఉత్సవాలకు ఆహ్వానం



గౌరీనాయుడు

కొత్తపల్లి: గుంటూరులో జరిగే జానపద సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొనాలని పిఠాపురం పట్టణానికి చెందిన యువసాహితీ వేత్త, రచయిత, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిలారి గౌరీనాయుడికి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జానపద సాహిత్యంలో ప్రజా చైతన్య కళారూపాలు అనే అంశంపై నాయుడు ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, రమణకు గౌరీనాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన



సామర్లకోట ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. బుధవారం ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌లో నీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ప్లాంట్‌లో పూర్తిగా శుద్ధి అయిన తరువాత ప్రజలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న నీటిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కుళాయిల ద్వారా తాగునీరు ఆకుపచ్చ రంగులో వస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తుందనే ప్రచారం మేరకు నీటిని నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపామన్నారు. ఫిల్టరు చెరువు, ఫిల్టర్ బెడ్, పబ్లిక్ కుళాయిలో వచ్చిన నీటిని ల్యాబ్‌కి పంపగా నీటిలో ఎటువంటి లోపాలు లేవని రిపోర్టు వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ నుంచి సరఫరా చేస్తున్న నీటిపై అపోహలు వీడి, నీటిని వేడి చేసుకుని చల్లార్చి తాగాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి



పెద్దాపురం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ తులసీమంగతాయారు

సామర్లకోట: సామర్లకోట– పెద్దాపురం రోడ్డులోని డివైడర్‌లో ఉన్న మొక్కల సంరక్షణపై పెద్దాపురం మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికార పార్టీ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ అన్నారు. బుధవారం పెద్దాపురంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ రోడ్డు వెంబడి డివైడర్‌లో ఉన్న మొక్కలు ఎండలకు చనిపోతున్నాయని, వాటికి నీరు పోసే ఏర్పాట్లు చేయడంతో పాటు కొత్త మొక్కలు వేయాలని సూచించారు. అదే విధంగా మున్సిపాలిటీ కొనుగోలు చేసిన జేసీబీని సక్రమంగా ఉపయోగించే విధంగా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ పూర్తయిన తరువాత మొక్కల విషయం పరిశీలిస్తామని కమిషనర్ పద్మావతి అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా చర్చలు జరపడానికి అవకాశం లేదన్నారు. వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావిద్‌రాజు, మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఫణికుమార్, అధికార, ప్రతిపక్ష సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్పు.. మన మంచికే..



సర్పవరం జంక్షన్ వద్ద పోలీసులు గుర్తించిన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు

కాకినాడ రూరల్: అతివేగం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది.. డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ కుటుంబంలో విషాదం నిండింది.. ఇవీ మనం తరచూ వినే వార్తలు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో చాలా మంది బలవుతూనే ఉన్నారు. మరికొందరు గాయాల పాలై దివ్యాంగులుగా మారుతున్నారు. ఇందుకు కారణం నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం. జిల్లాలో పోలీసులు సోమవారం సాయంత్రం రెండు గంటల పాటు నిర్వహించిన నాకాబందీ కార్యక్రమంలో రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎక్కువ మంది యువత లైసెన్స్‌లు లేకుండానే ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్టు వెల్లడైంది. మగవారికి ఆడవారు ఏమీ తీసుపోరన్నట్టు మహిళలు ముఖ్యంగా యువతులు లైసెన్స్‌లు లేకుండా స్కూటీలు నడుపుతున్నట్టు గుర్తించారు. ప్రమాదం జరగనంతసేపు బాగానే ఉంటుంది. మనం నడిపే వాహనంతో ఎవరినైనా ఢీకొడితే వారికి ఏమైనా అయితేనే చిక్కు. చట్ట ప్రకారం నేరం. ఇక యువకులు, విద్యార్థులు స్పీడ్ బైక్‌లతో ప్రమాదాలకు కారకులవుతున్నారు. వంద కిలోమీటర్ల స్పీడ్ దాటితేనే బైక్ నడిపినట్టుగా ఫీలవుతూ రోడ్డుపై ప్రయాణాలు చేసి ఇతర వాహనదారులకు దడ పుట్టిస్తున్నారు. చూస్తుండగానే తమను దాటుకుని అతి వేగంగా వెళుతున్న బైక్‌లు ఒకవేళ తమను ఢీకొడితే పరిస్థితి ఏంటనే భయాందోళన ప్రజల్లో ఉంది. ఎన్నికలు కౌంటింగ్ దగ్గర పడుతుండటంతో పోలీసులు అల్లరిమూకల నిర్మూలన, రికార్డులు లేని వాహనాల గుర్తింపు కోసం తనిఖీలు చేశారు. కానీ ఈ తనిఖీలు నిరంతర ప్రక్రియగా మారితే చాలామంది అశ్రద్ధ లేకుండా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోగలుగుతారు. తాము నడుపుతున్న వాహనాలకు సీ బుక్, ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర రికార్డులు ఉన్నాయో లేవో గమనిస్తారు. రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకుంటారు.

నమ్మండి.. ఇది నిజమండి

సోమవారం నిర్వహించిన నాకాబందీలో కాకినాడ జేఎన్‌టీయూ వద్ద వాహనాలు తనిఖీ చేస్తే ముఖ్యంగా యువతులు వంద మందిలో ముగ్గురికి మాత్రమే లైసెన్స్‌లు ఉన్నాయని తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో సీఐ మురళీకృష్ణ, తన సిబ్బంది వాహనాలు తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఆ వాహనాలు నడిపిన యువతకు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆలయ భూములకు కౌలు వేలం



పాదగయ ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం భూములకు బుధవారం కౌలు వేలం నిర్వహించారు. కొత్తపల్లి మండలం రమణక్కపేట, సామర్లకోట మండలం పవరలో ఉన్న భూములను ఏడాది పాటు సాగు చేసుకోవడానికి ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించారు. రమణక్కపేటలో 9.82 సెంట్ల భూమికి గతంలో రూ.2.25 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.4.01 లక్షలు సమకూరింది. పవరలో 2.38 సెంట్ల సాగు భూమికి గతంలో రూ.58 వేలు రాగా ఈ ఏడాది రూ. 1.01 లక్షలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

దానగుణంతో అమితానందం

కాకినాడ రూరల్: దానగుణంతో అమితానందం కలుగుతుందని, తోటి మనిషికి సాయం చేయడం వల్ల కలిగే ఆనందం ఎనలేనిదని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో దాత బసవరావు ఆర్థిక సహకారంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు బుధవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ పేదలు, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, శ్రీవాణి, డాక్టర్ శిరీష, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణగా గొడుగును ఆశ్రయించిన యువతులు



పెద్దిపాలెం ఏలేరు కాలువలో జలకాలు ఆడుతున్న యువకులు



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా జాతీయ రహదారి



ఎండకు జాతీయ రహదారిపై చెట్ల కింద నిలిపిన వాహనాలు

నిప్పుల కొలిమి

- తారెత్తిస్తున్న ఎండలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన కూడళ్లు

గోకవరం: కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణి కార్తె ప్రారంభం నుంచే రోళ్లు బద్దలయ్యేలా ఎండ కాస్తోంది. మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం భానుడు నిప్పులు కురిపించాడు. ఉదయం 10 గంటల నుంచి వడగాడ్పులు వీశాయి. ఎండ తీవ్రత, ఉక్కబోత గంటగంటకూ పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 11 గంటలకే వ్యాపారులు షాపులు మూసివేసి ఇంటిబాట పట్టారు. ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. రాత్రి 7 గంటల వరకూ వేడిగాలులు వీయడంతో ఇంట్లో ఉన్న వారు సైతం అసౌకర్యానికి గురయ్యారు.

ప్రత్తిపాడు రూరల్: ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉంది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు తారాస్థాయికి చేరుకున్నాయి. గత రెండు నెలలుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో బుధవారం ఎండ తీవ్రతతో పాటు, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోయారు. రుతుపవనాలు మరో కొద్ది రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. మరో రెండు, మూడు రోజుల్లో ఎండలు తగ్గుముఖం పడతాయని ప్రజలు భావించారు. అయితే ఎండలు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపించడం లేదు. రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఎండల తీవ్రత మరింత ఎక్కువైంది. ఒకపక్క ఎండ మరో పక్క ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. పగటి పూట 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అత్యవసర పనులు ఉంటే మినహా ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్ల, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. బుధవారం ఎండ తీవ్రతను తట్టుకోలేక 16 నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతలపానియాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, కూల్‌డ్రింక్‌ల విక్రయాలు జోరందుకున్నాయి.



ధర్మవరంలో ఎండ నుంచి రక్షణకు చీర చెంగు అడ్డుపెట్టుకున్న మహిళ



ఎండలకు జనసంచారం లేని ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డు

ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం

కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం) డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. దీంతో ఎండల తీవ్రత తగ్గే ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎండ సమయంలో ఇంటి నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

వడదెబ్బకు ప్రథమ చికిత్స ఇలా...

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడిక్లాత్‌తో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి, లేని పక్షంలో గ్లూకోజ్ ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసు కెళ్లాలి.

అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: వారం రోజులుగా ఎండలు మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉక్కపోతకు గురవుతున్నారు. గ్రామాల్లో అడపాదడపా విద్యుత్ కోతలు విధించడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వడగాడ్పులు వీశాయి. వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ సూచించారు.



గోకవరంలో నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ బస్టాండ్ సెంటర్


ఉక్కపోతతో ఇక్కట్లు

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి విద్యుత్ కోతలు తోడవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం తొమ్మిది గంటలకే రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీనికి తోడు అడపా దడపా విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇళ్లలో ఉక్కపోతకు గురై ఇబ్బందులు పడ్డారు. మరికొద్ది రోజులపాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

42 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రత్తిపాడు: వారం రోజులుగా భానుడు భగభగ మండిపోతున్నాయి. నియోజకవర్గంలో బుధవారం వాతావరణం నిప్పుల కొలిమిని తలపించింది. ఏటా వేసవికాలంలో రోహిణి ప్రారంభంలో ఇంత వేడిమి చూడలేదంటున్నారు ప్రజలు. ఉదయం 11 గంటలకే 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. భానుడు నిప్పులు కురిపిస్తుండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇంటో ఉక్కపోతకు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనులకు వెళ్లే కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక ఉదయం 10 గంటలకే ఇంటిముఖం పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రతలు తీసుకోవాలి. ఏవైనా పనులు ఉండే తప్ప ఎండలో తిరగకూడదు. అత్యవసరంగా ఎండలో బయటకు వెళ్లల్సి వస్తే కచ్చితంగా గొడుగు, టోపి, ధరించాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. – డాక్టర్ కె.మురళీమోహన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, శాంతిఆశ్రమం, ప్రత్తిపాడు మండలం